
మెరుగైన వైద్య సేవలు అందించండి

రుద్రూర్, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. రుద్రూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిసరాలు, వైద్య సదుపాయాలు, ఆసుపత్రి రిజిస్టర్లు పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి సేవల వివరాలు, డెంగీ కేసులు, సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. అన్నిరకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పనులు పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సంబంధిత సబ్జెక్టులో ప్రశ్నలు అడిగారు. పాఠశాలలో ఆరుబయట మధ్యాహ్న భోజనం వండుతుండటాన్ని గమనించి వంట గది ఎందుకు వినియోగించడం లేదని నిర్వాహకులను ప్రశ్నించారు. విద్యార్థినులకు అందించే భోజనం కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శంకర్, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఆర్.ఐ నజీర్, పీహెచ్‌సీ వైద్యురాలు డా.అయేషా, సూపర్‌వైజర్ రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

జిల్లాలో పట్టణాల పరిధి విస్తరిస్తూ ఉత్తర్వులు



నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: పట్టణీకరణ, రోడ్డు మార్గాలు, నీటి సరఫరా, ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, వాటికి అనుబంధంగా 380 గ్రామాలతో పరిధిని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

రగ్గులు ఇవ్వరు.. వేడి నీరు పెట్టరు ..6లో

అతివలకు అండగా..

పదేళ్లుగా జిల్లాలో షీటీమ్ పనితీరు భేష్

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

జిల్లాకు చెందిన ఓ యువకుడు.. తరచూ ఓ మహిళకు ఫోన్ చేస్తూ వేధించడంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. తనను ఒకరు వేధిస్తున్నారని స్నేహితురాలికి చెప్పగా.. షీటీమ్‌కి ఫిర్యాదు చేయమని సూచించింది. స్నేహితురాలి సూచనతో షీటీమ్‌కు ఫిర్యాదు చేయగా.. సదరు నిందితుడిని పట్టుకొని బాధితురాలి ఇబ్బందిని దూరం చేశారు.

ఆపదలో ఉన్న చెల్లికి అన్నదమ్ముడిలా.. భార్యకి భర్తలా.. తల్లికి కొడుకులా.. ఇలా నిరంతరం అతివలకు రక్షణ కల్పించడంలో ప్రతిక్షణం షీటీమ్ ముందుంటోంది. మహిళా ఉద్యోగులు తమ విధులు స్వేచ్ఛగా నిర్వహించుకోవడానికి.. యువతులు ధైర్యంగా తమ గమ్యం చేరుకునేందుకు తోడుంటోంది. అనుకోని సందర్భాల్లో మహిళలు కష్టాల్లో ఉన్నట్లు తెలిస్తే వారికి అండగా నిలుస్తోంది. ఎవరైనా వారికి ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిస్తే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకొని అందుకు కారణమైన నిందితులను కటకటాల్లోకి పంపుతున్నారు. పని ప్రదేశాలు, కళాశాలల్లో వేధింపులు, అఘాయిత్యాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇలా అన్ని విధాలా అతివలను అమ్మలా కాపాడుకుంటున్న షీటీమ్‌ను 2014 అక్టోబరు 24న రాష్ట్రంలోనే తొలిసారి హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. షీటీమ్ ఏర్పడి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

రాష్ట్రమంతటా షీటీమ్ విస్తరణలో భాగంగా 2015 ఏప్రిల్‌లో నిజామాబాద్‌లో ప్రారంభించారు. నిజామాబాద్ డివిజన్‌లో ఓ మహిళా ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లు, ఆర్మూర్ డివిజన్‌లో ముగ్గురు కానిస్టేబుళ్లు, ఓ మహిళా హెడ్‌కానిస్టేబుల్, బోధన్ డివిజన్‌లో ఓ కానిస్టేబుల్, మహిళా హోంగార్డు పనిచేస్తున్నారు. జిల్లాలో సగటున నెలకు పది ఫిర్యాదులు వస్తుండగా.. బాధితులను సమస్య నుంచి బయటపడేస్తున్నారు. 2020లో 49 ఘటనలు జరగగా.. ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ ఏడాది అక్టోబరు 24 వరకు 98 ఘటనలు జరగగా.. ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదైంది.



కేసుల వివరాలు..

సంవత్సరం	2020	2021	2022	2023	2024
పెట్టిన కేసులు	32	68	30	66	69
★★★	2	2	7	1	3
పట్టుబడినవారు	70	158	100	117	118
●●●	28	93	97	62	42

★★★ నమోదైన ఎఫ్ఐఆర్‌లు ●●● అవగాహన కార్యక్రమాలు

ప్రత్యేక నిఘా..

రెడ్ హ్యాండెడ్ టాస్క్‌లో భాగంగా జిల్లాలోని కళాశాలల తోపాటు మహిళలు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడడం, అమ్మాయిలను తదేకంగా చూడడం, వారిపై చెడుగా మాట్లాడడం, హేళన చేయడం లాంటివి చేస్తే నిఘా పెట్టి పట్టుకుంటున్నారు. ఇలా పట్టుకున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు తీవ్రత ఆధారంగా కేసులు నమోదు చేస్తున్నారు. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటే చరవాణి నంబర్ 87126 59795 లో లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వొచ్చు.



నిర్భయంగా పనులు చేసుకోవాలి

నిజామాబాద్ షీటీమ్ అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కొనసాగుతోంది. మహిళలు నిర్భయంగా పనులు చేసుకోవాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే మమ్మల్ని సంప్రదించాలి. ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని మహిళలు తమ జీవితాలు నాశనం చేసుకోవద్దు. అతివలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. **- స్రవంతి, నిజామాబాద్ షీటీమ్ ఎస్సై**

ప్రతిష్ఠ పెంచేలా.. పారదర్శక పాలన



'న్యూస్‌టుడే'తో తెవివి వీసీ ఆచార్య టి. యాదగిరిరావు

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్



తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ పెంచేలా, పారదర్శక పాలన అందిస్తానని ఉపకులపతి ఆచార్య టి.యాదగిరిరావు అన్నారు. విద్యార్థుల సమస్యల్ని తీరుస్తూ, వర్సిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలు వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే..

ఇంజినీరింగ్‌కు తొలి ప్రాధాన్యం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడం బాధాకరం. వర్సిటీలో ఓ కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశ పెట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

పరిధి విస్తరణకు కృషి చేస్తా

తెవివి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకే పరిమితమైంది. అఫిలియేషన్ విస్తరించి నిర్మల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలను వర్సిటీ పరిధిలోకి తెచ్చేలా ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. పరిధి పెరిగితే అనేక ప్రయోజనాలుంటాయి.

చట్టం పరిధిలో నడుచుకుంటా

వర్సిటీలో గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిగింది. ఇది ప్రభుత్వ అధీనంలోని అంశం. చట్టం పరిధిలో ప్రభుత్వ ఆదేశాలతో నా బాధ్యతలు నిర్వర్తిస్తా. 2014లో నియామకమైన అధ్యాపకుల అంశం కోర్టు పరిధిలో ఉందని నా దృష్టికి వచ్చింది. పదోన్నతుల అంశంపై కోర్టు అడ్డంకులు పూర్తిగా తొలగి, ప్రభుత్వ అనుమతి ఇస్తే ఆలోచన చేస్తా.

న్యాక్ గుర్తింపునకు సిద్ధం

మెరుగైన న్యాక్ గ్రేడ్ సాధించేందుకు కసరత్తు ప్రారంభించాం. విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి నివేదిక తయారుచేయాలని ఆదేశించా. వీలైనంత త్వరలో న్యాక్‌కు సెల్ఫ్ రిపోర్టు సమర్పిస్తాం. న్యాక్ బృందం వచ్చేలోపు అవసరమైన ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంటాం.

అధ్యాపకులు బాధ్యతగా మెలగాలి

వర్సిటీలోని అధ్యాపకులందరూ బాధ్యత పని చేయాలి. సకాలంలో విధులకు హాజరై విద్యార్థులకు పాఠాలు బోధించాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. ఉద్యోగులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి వర్సిటీ అభివృద్ధికి పాటు పడాలి. వ్యక్తిగత ప్రయోజనాలకు పోకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, వర్సిటీ సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యం.

విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యం

వర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తా. క్రీడా మైదానం, ఆటలకు ప్రోత్సాహం, అవుట్ డోర్ స్టేడియం, బాలబాలికలకు వేర్వేరుగా జిమ్‌ల ఏర్పాటు చేసేలా చూస్తా. కొత్త అంబులెన్సును అందుబాటులోకి తెస్తా.

రూసా నిధుల వినియోగం

రూ. 20 కోట్ల రూసా నిధుల్లో రూ.10 కోట్లతో సైన్స్ కళాశాల నిర్మిస్తున్నారు.. నిర్మాణం తుది దశలో ఉంది. రూ.6 కోట్లతో మహిళా వసతి గృహం నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం. రూ.2 కోట్లతో రోడ్లు, ఫుట్‌పాత్ నిర్మాణం, మరో రూ.2 కోట్లతో కంప్యూటర్లు, మౌలిక వసతులకు వినియోగిస్తాం.

ప్రవేశాల ప్రక్రియ వేగంగా చేపట్టాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో ప్రవేశాల ప్రక్రియ వేగంగా చేపట్టాలని జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సంజయ్‌కుమార్ హైదరాబాద్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. నిజామాబాద్, బోధన్, కమ్మర్‌పల్లి కేంద్రాల్లో అభ్యర్థులు ఐటీఐలో ముఖాముఖికి హాజరు కావొచ్చని పేర్కొన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఉన్నారు.

ఇంటి నుంచి తెచ్చుకోవడమే..!


పెచ్చులూడిన పైకప్పు

●● **వసతిగృహం పేరు:** షెడ్యూల్డ్ కులాల(బాలుర) కళాశాల వసతిగృహం, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల

✤✤ **విద్యార్థులు సంఖ్య:** 86

★★ **దుప్పట్లు, రగ్గులు ఎంతమందికి ఉన్నాయి:** దుప్పట్లు, రగ్గులు ఇంకా రాలేదు.

✪✪ **కిటికీల పరిస్థితి :** మూడు గదుల్లో కిటికీలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. భవనం శిథిలావస్థకు చేరగా పైకప్పు పెచ్చులూడుతుండటంతో విద్యార్థులు భయంగా గడుపుతున్నారు. మంచాలు లేకపోవడంతో కిందనే నిద్రిస్తున్నారు. దోమల బెడద ఉన్నట్లు విద్యార్థులు వాపోయారు.

✦✦ **స్నానాలు చేసేందుకు వేడినీటి వసతి ఉందా:** లేదు.

☛ **వార్డెన్ వివరణ:** ఇటీవల బదిలీపై వచ్చానని, రాగానే రూ.20వేలకు పైగా ఖర్చు చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్తు మరమ్మతులు చేశామని, దోమల నివారణకు ప్రతి గదికి గుడ్‌నైట్ మిషన్లు అందజేశామని వార్డెన్ నవీన్ వివరించారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, ఆర్యనగర్

మూడేళ్లు నిలిచిన దుప్పట్ల పంపిణీ


తలుపు లేని కిటికీ, దెబ్బతిన్న తలుపు

●● గిరిజన బాలుర కళాశాల వసతిగృహం, దారుగల్లి ✤✤ 89 ★★ మూడేళ్లుగా దుప్పట్లు, రగ్గులు రావడం లేదని విద్యార్థులు వివరించారు. మంచాలతో పాటు పరుపులు గతంలోనే సరఫరా చేశారు. నాణ్యతా లోపంతో పనికి రాకుండా పోయాయి. ✪✪ మూడు గదుల్లో దర్వాజాలతో పాటు కిటికీలకు తలుపులు దెబ్బతిన్నాయి. ✦✦ లేదు ☛ బదిలీపై రాగానే వసతిగృహంలోని నీటి సమస్యను తొలగించేందుకు బోరు వేయించామని, ఆర్వోప్లాంటు లేనప్పటికీ రక్షిత నీరు అందజేస్తున్నామని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని వార్డెన్ గోదావరి తెలిపారు. - న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

దోమ తెరలకు చిల్లులు


కిటికీలకు సరిగా లేని దోమతెర జాలి

●● సమీకృత వసతి గృహం, న్యాల్‌కల్ రోడ్డు ✤✤ 153 ★★ దుప్పట్లు జూన్‌లోనే పంపిణీ చేసినా.. రగ్గులు ఇవ్వలేదు. ✪✪ కిటికీలకు దోమల జాలీలున్నా అక్కడక్కడ ఊడిపోయాయి. ✦✦ లేదు. ☛ రగ్గులు, స్వెటర్లు రావాల్సి ఉంది. రాగానే విద్యార్థులకు పంపిణీ చేస్తాం. కిటికీలకు దోమతెర జాలీలు సరిగా లేనందునా మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు తెలియజేశాం. - న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి

రగ్గులు ఇవ్వరు.. వేడి నీరు పెట్టరు

● ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు

పరిశీలన

చలికాలం రానే వచ్చింది. ప్రభుత్వ వసతిగృహాలు సమస్యల నిలయాలుగా మారాయి. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చలి నుంచి రక్షణ కోసం కప్పుకొనేందుకు దుప్పట్లు, పడుకునేందుకు మంచాలు లేక అవస్థల పాలవుతున్నారు. కిటికీలు, దర్వాజాలకు తలుపులు లేవు. అట్టముక్కలు అడ్డం పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. స్నానం చేద్దామంటే వేడి నీటి వసతి లేదు. ఇలా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారు. గురు, శుక్రవారాల్లో 'న్యూస్‌టుడే' ఉమ్మడిజిల్లాలోని పలు వసతిగృహాలు పరిశీలించగా ఎన్నో సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

నేలపైనే నిద్ర


ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకొని నిద్రపోతున్న విద్యార్థులు

●● బీసీ బాలుర కళాశాల వసతిగృహం ✤✤ 61 ★★ కళాశాల వసతిగృహాలకు కేవలం ఆశ్రయం మాత్రమే కల్పిస్తున్నారు. ఇంటి నుంచి తెచ్చుకున్న రగ్గులే కప్పుకొని నిద్రపోతున్నారు. ✪✪ కిటికీలకు జాలీలు ఉన్నాయి. పలు గదుల్లో తలుపు సందుల నుంచి గాలి లోనికి వస్తోంది. ✦✦ లేదు. ☛ వార్డెన్ నరేశ్ స్పందిస్తూ.. పిల్లలకు వేడి నీటి స్నానం కోసం యంత్రాలు లేక సమస్య నెలకొందన్నారు. సర్కారు నుంచి స్పందించి యంత్రాలు అందించాలని కోరారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

టెండర్ల దశలోనే..!


వినియోగంలోకి రాని ఆర్వో ప్లాంటు

●● షెడ్యూల్డ్ కులాల(బాలుర) కళాశాలల వసతి గృహం, నామ్‌దేవ్‌వాడ ✤✤ 170 ★★ పంపిణీ చేయలేదు. ✪✪ బాగానే ఉన్నాయి. ✦✦ వేడి నీటి వసతి లేదు. తాగునీటికి సంబంధించిన ఆర్వో ప్లాంటు వినియోగంలో లేదు. ☛ రగ్గులు, దుప్పట్లకు టెండర్లు నిర్వహిస్తున్నారని, త్వరలోనే సరఫరా చేసే అవకాశముందని వార్డెన్ జీవన్ తెలిపారు. ఆర్వో ప్లాంటుతో ఎక్కువ నీరు వృథా అవుతుందని ఇష్టం లేక వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. తాగడానికి రక్షిత మంచి నీరు ఇస్తున్నట్లు చెప్పారు. - న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం, ఇందూర్ సిటీ

పాడైన జాలీలు.. కిటికీకి కాగితాలు


కిటికీకి అడ్డుగా పెట్టిన కాగితాలు

●● షెడ్యూల్డ్ కులాల కళాశాల వసతిగృహం ✤✤ 56 ★★ అందరికి దుప్పట్లు, రగ్గులు ఉన్నాయి. మంచాలు లేకపోవడంతో నేలపై పడుకుంటున్నారు. కింద పర్చుకోవడానికి ఇంటి నుంచి బ్లాంకెట్లు తెచ్చుకున్నారు. ✪✪ వసతిగృహంలో రెండు గదుల్లో కిటికీలకు కాగితాలను అతికించారు. ✦✦ ఉంది. ☛ చిన్నపాటి సమస్యల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని.. త్వరలోనే పనులు చేపడతామని ఇన్‌ఛార్జి వార్డెన్ నాగరాజు తెలిపారు.

-న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం

చన్నీళ్ల స్నానమే..!

●● బీసీ బాలుర వసతిగృహం, గడీ రోడ్డు-కామారెడ్డి ✤✤ 80 ★★ అందరికీ పంపిణీ చేశారు. ✪✪ కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేశారు. చలి లోపలికి రాకుండా చర్యలు చేపట్టారు. ✦✦ లేదు. ☛ బీసీ బాలుర వసతిగృహంలో దుప్పట్లు, రగ్గులు విద్యార్థులకు పంపిణీ చేశాం. వేడి నీటికి యంత్రాలు లేక ఇబ్బందులున్నాయి. యంత్రాలు ఏర్పాటుచేస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందని పిట్ల పవన్ చెప్పారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

ఇక్కడ అధ్వానం

●●: గురుకుల పాఠశాల ఉప్పల్‌వాయి. ✤✤ 560 మంది ★★ దుప్పట్లు 130 మందికి రాలేవు. ✪✪ వసతి గృహంలో కిటికీల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రతి గదిలో కిటికీలు విరిగిపోవడంతో చాప అడ్డుగా పెట్టారు. దోమల జాలి దెబ్బతిన్నాయి. ✦✦ లేదు. ☛ దోమలు రాకుండా జాలీల ఏర్పాటుకు, కిటికీలు, తలుపుల మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేయిస్తాం. - న్యూస్‌టుడే, రామారెడ్డి

రెండు హాస్టళ్ల విద్యార్థులు ఒకే చోట

●● ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహం ✤✤ ఎస్టీ విద్యార్థులు..100, ఎస్సీ విద్యార్థులు 200మంది ★★ వసతి పొందుతున్న అందరికి సొంతంగా తెచ్చుకున్న దుప్పట్లు, రగ్గులు ఉన్నాయి ✪✪ నూతన భవనం కావడంతో కిటికీలు, దోమతెరలు ఉన్నాయి ✦✦ ఇక్కడ గీజర్లు లేవు. దీంతో విద్యార్థులు చలికాలంలో చన్నీళ్ల స్నానమే చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆర్మూర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడి విద్యార్థులను ఇక్కడికి పంపించడంతో వసతులు సరిపోవడం లేదు. ☛ ఎస్సీ వసతి గృహం కోసం అద్దె భవనం చూశాం. త్వరలోనే అక్కడికి తరలిస్తామని వార్డెన్ సురేశ్ తెలిపారు. ప్రభుత్వం నుంచి వస్తేనే రగ్గులు, దుప్పట్లు అందజేస్తామన్నారు. ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు లోపలికి వస్తున్నాయి.

- ఆర్మూర్ పట్టణం

స్థలం లేక.. ఆరుబయటే వాహనాలు



కామారెడ్డి బోధనాసుపత్రి ఇరుకుగా మారింది. 28 ఏళ్ల క్రితం వంద పడకల ఆసుపత్రి ఏర్పాటైంది. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రి, బోధనాసుపత్రిగా ఏర్పాటైంది. స్థాయి పెరిగినా.. ఇక్కడ రద్దీకి అనుగుణంగా వసతులు సమకూరలేదు. వాహనాల పార్కింగ్‌కు తీవ్ర కష్టతరమవుతోంది. మొన్నటి వరకు ఆసుపత్రి ఆవరణలో వాహనాలు నిలిపారు. అత్యవసర వేళల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో సిబ్బందిని నియమించి వాహనాలను లోనికి అనుమతించడం లేదు. ప్రైవేటు వాహనాలను బయటే ఉంచి ఆసుపత్రి లోనికి వెళ్లడంతో రోడ్డుపై ట్రాఫిక్ ఇక్కట్లు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని న్యూస్‌టుడే శుక్రవారం క్లిక్‌మనిపించింది. - **న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం**

మొదలుకాని కొనుగోళ్లు.. రోడ్డుపై ధాన్యపు రాశులు



రోడ్డుకు ఇరువైపులా ధాన్యం ఆరబెట్టిన ఈ చిత్రం మోపాల్ మండలంలోని బాడ్సి గ్రామ శివారులోనిది. జిల్లాలో వానాకాలం వరి కోతలు నెల రోజుల క్రితం ప్రారంభం కాగా.. ప్రస్తుతం జోరందుకున్నాయి. దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. ఇంకా రైస్ మిల్లర్లతో ఒప్పందం కాకపోవడంతో అధికారికంగా కొనుగోళ్లు మొదలు కాలేదు. దీంతో కోసిన ధాన్యాన్ని రోడ్లపైనే రోజుల తరబడి కుప్పలుగా పోసి నిల్వ చేస్తూ అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి స్థలాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలు, రోడ్లపై ఖాళీ స్థలాలు ఉంటే రైతులు ముందుగానే ప్లాస్టిక్ కవర్లు అక్కడ పరిచి తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి.

- **ఈనాడు, నిజామాబాద్**

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం: షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, పీడీ బాలామణి తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం క్రీడాకారులు ఉమేశ్ (బీఏ మూడో సంవత్సరం), నితీష్ (బీఏ రెండో సంవత్సరం)లను అభినందించారు. ఈ నెల 26, 27 తేదీల్లో చెన్నైలో జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నమెంటులో పాల్గొంటారన్నారు. అక్కడ విజయం సాధించి పతకంతో రావాలని ఆకాంక్షించారు.


క్రీడాకారులతో వీసీ ఆచార్య యాదగిరిరావు

చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తాం

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తామని వీసీ ఆచార్య టి.యాదగిరిరావు అన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు చెన్నైలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎంపికైన నికేశ్(గిరిరాజ్ కళాశాల), అనిల్, సాయికుమార్(తెవివి), రోహన్(ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కామారెడ్డి) క్రీడాకారులను వీసీ అభినందించారు. స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, పీడీ నేత ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

తెవివి క్యాంపస్: హాల్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన తెవివి భిక్కనూరు దక్షిణ ప్రాంగణ జువాలజీ విభాగం విద్యార్థులు డి.సరిత, ఎం.అవినాశ్, అజయ్‌గౌడ్‌ను శుక్రవారం వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు. జువాలజీ విభాగం స్థాపించిన తర్వాత తొలిసారిగా విద్యార్థులు ఈ అవకాశం పొందడం వర్సిటీకి గర్వకారణమన్నారు. వీసీని జిల్లా డీసీఈబీ(డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) కార్యదర్శి బి.సీతయ్య, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వేర్వేరుగా కలిసి సన్మానించారు.

భవనాల పరిశీలన

తెవివి క్యాంపస్: తెవివిలో నిర్మాణ దశలో ఉన్న సైన్స్ కళాశాల భవనాన్ని శుక్రవారం వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి పరిశీలించారు. న్యాయ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని, బాలికల వసతి గృహాన్ని, ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. సమస్యలు రాకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చీఫ్ వార్డెన్ మహేందర్‌ను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తెవివి క్యాంపస్: తెవివిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం వీసీ ఆచార్య యాదగిరిరావుకు వినతిపత్రం ఇచ్చారు. బోధన, బోధనేతర ఖాళీలు భర్తీ చేయాలని, ల్యాబ్‌లు మెరుగుపర్చాలని, మరో మహిళా హాస్టల్ నిర్మించాలని కోరారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, అమృత్‌చారి, నాయకులు నాగరాజు, పావని, బాంధవ్య, సమీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం సహాయక సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని మెప్మా పథక సంచాలకులు రాజేందర్ తెలిపారు. ఇందూరు మహిళా పట్టణ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం మహాజన సభ శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. దీనికి పీడీ హాజరై మాట్లాడారు. తీసుకున్న రుణాలను చాలా మంది సభ్యులు వడ్డీకి ఇస్తున్నారని.. అలా కాకుండా వ్యాపారాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. మహిళా శక్తి కింద ఏర్పాటు చేసే యూనిట్లు నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. పలువురు ఆర్పీలకు ట్యాబ్‌లు అందించారు. స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, మెప్మా ఏవో విజయ, డీఎంసీ మాధురి, టీఎంసీ శోభ, సంఘం అధ్యక్షురాలు మాశెట్టి శోభ తదితరులు పాల్గొన్నారు.


ఆర్పీకి ట్యాబ్ అందిస్తున్న మెప్మా పీడీ రాజేందర్, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్ తదితరులు

వాలీబాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక

జక్రాన్‌పల్లి: కలిగోట్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పూజ, గంగోత్రి, మనీష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు పెద్దపల్లిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంచారి, ఛైర్మన్ సువర్ణ అభినందించారు.

ఉషా క్రీడాకారిణికి అభినందన


విద్యార్థినితో పాఠశాల ప్రతినిధులు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: యూరప్‌లోని జార్జియా దేశంలో ఈ నెల 17-23 తేదీల్లో నేషనల్ ఉషా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన బటుమి ఓపెన్ ఇంటర్నేషనల్ ఉషా మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన విజయ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.ఆకాంక్ష పాల్గొని పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థినిని పాఠశాల వ్యవస్థాపకురాలు అమృతలత, సిబ్బందితో కలిసి అభినందించారు. క్యాయాన్షు విభాగంలో రజతం, జియాన్షు విభాగంలో కాంస్య పతకాలు సాధించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఆమె తల్లిదండ్రుల తోడ్పాటును కొనియాడారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న అదనపు పాలనాధికారి అంకిత్, ఇతర అధికారులు

పశు గణన పక్కాగా నిర్వహించాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పశు గణనను పక్కాగా నిర్వహించాలని అదనపు పాలనాధికారి అంకిత్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గణనను ప్రారంభించి మాట్లాడారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు 109 మంది విషయ సేకరణదారులు, 23 మంది పర్యవేక్షకులు గణన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశు సంవర్ధక సేవలు మెరుగుపర్చేందుకు సర్వే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, పశు గణన అధికారి బస్వారెడ్డి, సహాయ సంచాలకులు గంగాధరయ్య, భరత్, రోహిత్‌రెడ్డి, జియుద్దీన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు బాసట

జక్రాన్‌పల్లి: పీఆర్టీయూ ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు బాసటగా నిలుస్తుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మాపూర్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్ ఇటీవల మృతిచెందారు. మృతుడి భార్య కల్యాణికి సంఘం నుంచి రూ.లక్ష చెక్కును శుక్రవారం అందజేశారు. ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు గోపి, నవీన్, సురేందర్‌రెడ్డి, లింగన్న, అశోక్, వినోద్ తదితరులున్నారు.


రూ.లక్ష చెక్కును అందిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

బోధన్ (గ్రామీణం) : తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే భక్తులకు బోధన్ నుంచి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 13న బోధన్ నుంచి జిల్లా కేంద్రం మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని కాణిపాకం గణపతి దర్శనం అనంతరం వేలూరులోని శ్రీమహాలక్ష్మి అమ్మ వారి దర్శనం తర్వాత నవంబర్ 14న రాత్రికి అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో నవంబర్16న అలంపూర్‌లోని జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం దర్శనం అనంతరం ఆదేరోజు రాత్రికి బోధన్‌కు చేరుకుంటుందని వివరించారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు డిపోలో సంప్రదించాలని కోరారు.

ముఖ్యమంత్రికి సన్మానం



నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇటీవల తనను రైతు కమిషన్ సభ్యుడిగా నియమించారని.. ఆ పదవి కాకుండా వేరేది కేటాయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా.. పరిశీలించి న్యాయం చేస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు గడుగు తెలిపారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ శ్రీనివాస్



బెటాలియన్‌లో పనితీరు వివరిస్తున్న పోలీసులు



ఆయుధాల గురించి వివరిస్తున్న అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు

ఆయుధాల ప్రదర్శన

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిలకించడానికి వచ్చిన విద్యార్థులకు 303 రైఫిల్, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, ఏకే 47, 9 ఎంఎం కార్బన్, గ్యాస్‌గన్, యాంటీ రైడ్ గన్, పిస్టల్, రివాల్వర్, గ్రెనేడ్, ఎల్ఎంజీ, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, కమ్యూనికేషన్స్ విభాగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు, అదనపు డీసీపీ(ఏఆర్) శంకర్‌నాయక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ నాగయ్య, ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ నాగమోహన్‌రావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సతీశ్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి, శేఖర్, ఎస్‌బీ సీఐ ప్రసాద్, పోలీసు సంఘం అధ్యక్షుడు షకీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో కమాండెంట్ సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మోపాల్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని మోపాల్ ఠాణా ఆధ్వర్యంలో కంజరలోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్సై రమేశ్, సిబ్బంది సామ్యూల్, పోచయ్య, పాఠశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి ఉన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

బోధన్ (గ్రామీణం), న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆ శాఖ ఆధ్వర్యంలో బోధన్ గ్రామీణ సీఐ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏసీపీ శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. పలువురు ముందుకువచ్చి రక్తదానం చేయడంపై అభినందించారు. అమరుల చిత్రపటానికి నివాళులర్పించారు. 45యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్ సొసైటీకి అందించారు. కార్యక్రమంలో సీఐ వెంకటనారాయణ, డివిజన్‌లోని ఎస్సైలు మచ్చేందర్‌రెడ్డి, కృష్ణ, సాయన్న, వంశీకృష్ణారెడ్డి, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి కావ్య, ప్రదీప్‌గుప్తా, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పంపిణీ ఇంకెప్పుడు?

న్యూస్‌టుడే, రెంజల్



కందకుర్తిలో నిరుపయోగంగా ఉన్న ఇళ్లు

నిరుపేదలకు సొంతింటి కల ఏళ్లుగా తీరడంలేదు. గత ప్రభుత్వ హయాంలో రెంజల్ మండలం కందకుర్తిలో 50, కల్యాపూర్‌లో 30, దూపల్లిలో 18 రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. దూపల్లిలో శాసనసభ ఎన్నికలకు ముందే వాటిని ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన రెండు గ్రామాల్లో మాత్రం ఇప్పటికీ అందించలేదు. కల్యాపూర్‌లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎంపిక చేసిన లబ్ధిదారులు అధికారుల అనుమతి లేకుండా ఇళ్లలోకి వెళ్లారు.. అధికారులు వారిని ఖాళీ చేయించి తాళాలు వేశారు. కందకుర్తిలో అర్హులైన తమకు ఇళ్లు కేటాయించాలని కోరుతూ పలుమార్లు పేదలు రోడ్డెక్కి రాస్తారోకో చేశారు. కాగా నిర్మాణం పూర్తయిన ఇళ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కల్పించుకొని అర్హులకు ఇళ్లు కేటాయించాలని పేదలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రవణకుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. కందకుర్తిలో అర్హులను ఎంపిక చేసేందుకు కొత్తగా దరఖాస్తులు తీసుకున్నామని చెప్పారు. విచారణ అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేపట్టి అర్హులకు అందిస్తామని పేర్కొన్నారు. కల్యాపూర్‌లో గత జాబితాను ఉంచాలో.. లేక కొత్త దరఖాస్తులు తీసుకోవాలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అందుబాటులోకి ఉచిత వైఫై





చదువుకుంటున్న అభ్యర్థులు

పాత డీఈవో కార్యాలయంలో కొనసాగుతున్న రీడింగ్ రూంలో మరో రెండు గదులు, వివిధ అంశాలపై అంతర్జాలంలో చదువుకునేందుకు ఉచిత వైఫై కావాలని అభ్యర్థులు కోరారు. దీనిపై గతంలో ఈనాడులో కథనం ప్రచురితమయింది. ఈ సమస్యను రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంప నాగేందర్ బాధ్యులు చేపట్టిన ఆంతిరెడ్డి రాజారెడ్డికి దృష్టికి శుక్రవారం తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఉచిత వైఫై ఏర్పాటు చేయించారు. పరిసరాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. ఎలాంటి సమస్యలున్నా తనకు చెప్పాలని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం



రీడింగ్ రూంలో ఏర్పాటు చేసిన వైఫై పరికరాలు

సమస్యలు పరిష్కరించాలని నిరసన

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని సంచార్ భవన్ ఎదుట బీఎస్ఎన్ఎల్ఈయూ, ఏఐబీడీపీఏ, బీఎస్ఎన్ఎల్ సీసీఎల్యూఎస్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈబీ ఎల్ నారాయణ మాట్లాడుతూ.. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు వేతన సవరణ చేయాలన్నారు. వెంటనే 4జీ, 5జీ సేవలను ప్రారంభించాలని కోరారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. సాయన్న, మధుసూదన్, లీల, పాండురంగమ్, ముత్తెన్న, సుభాష్, కృష్ణ, అసూరద, లత, సాయిలు, బాబయ్య పాల్గొన్నారు.



సంచార్ భవన్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సోయా రైతుల ధర్నా

పోతంగల్, న్యూస్‌టుడే: హెగ్డోలిలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రం ఎదుట రైతులు శుక్రవారం ధర్నా చేశారు. కేంద్రంలో కొనుగోలు చేసిన పంట గోదాములకు తరలించిన తర్వాత రంగు మారాయంటూ తిప్పి పంపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హెగ్డోలి కొనుగోలు కేంద్రంలో 51 మంది రైతులకు సంబంధించి 1,481 బస్తాల సోయా కొనుగోలు చేశారు. వారం కిందట 681 బస్తాల లోడును సారంగాపూర్‌లోని సీడ్‌బ్యాంక్ గోదాంకు తరలించారు. అక్కడ సోయాను పరిశీలించిన అధికారులు రంగు మారిందని 325 బస్తాలను తిప్పి పంపించారు. రైతులకు సంబంధించిన పంటను కొంత భాగం దించుకుని మరికొంత భాగం తిరస్కరించడంపై రైతులు అనుమానాలు వ్యక్తం చేశారు. రంగు మారితే పంట పూర్తిగా మారాలి కానీ కొంత మారి కొంత మారకపోవడం ఏంటని ప్రశ్నించారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



సోయా కొనుగోలు కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సమస్య: మాదాపూర్‌లో గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు ఒక్కడే ఉన్న కారణంగా మురుగు కాలువల పరిశుభ్రత ఆలస్యం అవుతుంది.
- నర్సయ్య, మాదాపూర్

సమాధానం: పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉంది. ఇతర ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చి శుభ్రం చేయిస్తాం.
- రఘురాం, గ్రామ కార్యదర్శి, మాదాపూర్

సమస్య: రోటరీనగర్ ఆర్ఎస్ఓక్ ఎదురుగా ఉన్న రోడ్డు వద్ద మా ఇంటి వెనక ఒక ప్లాట్ ఉంది. అక్కడ చెత్త వేయడంతో మురుగు నీరు ఆగి విపరీతంగా వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉంది.
- అనంతలక్ష్మి, స్థానికురాలు

పరిష్కారం: ప్లాట్ యజమానికి నోటీసు పంపి ఏర్పాటు చేస్తాం. చెత్త వేయకుండా ఇంటి యజమానులకు హెచ్చరిస్తాం.
- మహిపాల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: నగరంలోని వినాయక్‌నగర్ బస్వాగార్డెన్ పక్క రోడ్డుపై ఖాళీ స్థలంలో మురుగు నిలుస్తోంది.
- మల్లికార్జున్, స్థానికుడు

సమాధానం: కార్మికులను పంపించి మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
- సునీల్, జోన్-2, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, నగర పాలక సంస్థ

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ నగరం

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో శనివారం నుంచి చేపట్టనున్న తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ పార్లమెంట్ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీలో క్రియాశీల సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా రూ.5 లక్షలు, ఇతర ఖర్చులకు రూ.10 వేల సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేశ్, నరసింహులు, సత్యనారాయణ, కల్లెడ గంగాధర్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన తెదేపా నాయకులు

కొనసాగుతున్న మరమ్మతులు

మరమ్మతుల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి నుంచి నిజామాబాద్ - హైదరాబాద్ ప్రధాన రహదారిలోని మాధవనగర్ రైల్వేగేటు మూసివేసిన విషయం విదితమే. శుక్రవారం ఉదయం నుంచి పట్టాల మరమ్మతు పనుల్లో కార్మికులు పెద్ద ఎత్తున నిమగ్నమయ్యారు. శనివారం రాత్రి వరకు పూర్తి చేస్తామని రైల్వే సిబ్బంది తెలిపారు.

- ఈనాడు, నిజామాబాద్



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నిజామాబాద్ నేరవిభాగం : గిరిరాజ్ కళాశాల వద్ద శుక్రవారం రాత్రి ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడ్డారు. స్థానికులు గమనించి వీరిద్దరిని నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. ప్రమాదానికి గురైన ఇద్దరు నగరానికి చెందిన యూసుఫ్, అవినాష్‌లుగా గుర్తించారు.

ఏఆర్ ఎస్సైపై ఫిర్యాదు

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో 20 ఏళ్లుగా ఒకే పోస్టింగులో పని చేసిన ఓ ఏఆర్ ఎస్సై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బెటాలియన్ అడిషనల్ డీజీపీకి ఓ సిబ్బంది లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. బెటాలియన్‌లో కొత్తగా వచ్చే వారికి తప్పుడు సమాచారం ఇస్తూ కింది స్థాయి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఉన్నతాధికారుల్ని మాటలతో నమ్మిస్తూ పరిపాలన బాధ్యతలు చూసుకుంటున్నాడని పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

నిజామాబాద్ వ్యవసాయం : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి డిమాండ్ చేశారు. కేంద్రాలు తెరుస్తున్నట్లు ప్రకటించినా తూకం వేయడం లేదని, వర్షం వస్తే రైతులు నష్టపోతారన్నారు. వర్షం వస్తే ధాన్యం తడిసి రైతులు నష్టపోతారన్నారు. అన్నదాతలు రోడ్లపై రోజుల తరబడి నిల్వ చేసుకుని ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందన

నిజామాబాద్ క్రీడావిభాగం : ఈ నెల 17 నుంచి 24 వరకు జార్జియాలో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంటులో జిల్లా క్రీడాకారులు మల్లారం ఆకాంక్ష, వెంకీ, కాంస్య పతకాలు, పరియా ఖానం, సాయి దీక్షిత్ చెరో కాంస్య పతకం సాధించారని తెలంగాణ అమెచూర్ చెస్ సంఘం కార్యదర్శి, శిక్షకుడు అబ్దుల్ ఉమర్ తెలిపారు. క్రీడాకారులు శుక్రవారం జిల్లాకు చేరుకోగా పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

కొంత సంపాదన సేవకు వెచ్చించాలి

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు తాము సంపాదించిన దాంట్లో నుంచి కొంత సమాజ సేవకు ఉపయోగించాలని రోటరీ గవర్నర్(3150) సరత్ చౌదరి కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిజామాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.28.30 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోటరీ ఆధ్వర్యంలో కొవిడ్ సమయంలో ఆక్సిజన్, పడకలు, ఆసుపత్రికి ఉపయోగించే అత్యాధునిక మైన యంత్రాలు అందజేశామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. ఈ యంత్రంతో రోజూ 200 నుంచి 250 ఎక్స్‌రేలు తీసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ జిల్లా అధ్యక్షుడు విజయ్ రావు, కార్యదర్శి గంగారెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ వేద్ ప్రకాష్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ ఎక్స్‌రే యంత్రం ప్రారంభిస్తున్న రోటరీ గవర్నర్ సరత్ చౌదరి

శిశువు అప్పగింత



బాలల పరిరక్షణ విభాగం అధికారికి శిశువును అందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రిలో నెల క్రితం ఓ బాలిక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత బాలిక అనారోగ్యంతో మరణించింది. శిశువుకు శ్వాస సమస్య ఉండటంతో జిల్లా ఆసుపత్రిలోనే చికిత్స అందించారు. ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడటంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి చైతన్యకు శిశువును అప్పగించారు. అనంతరం శిశువును బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిశువిహార్‌కు తరలించారు. జగిత్యాల గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైన ఉండటంతో విచారణ కోసం శిశువును శిశువిహార్‌కు పంపించారు.

రతన్ టాటాకు నివాళి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే : టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో రతన్‌టాటా సంస్మరణ సభ నిర్వహించారు. నగర మేయర్ నీతూకిరణ్ కార్యక్రమంలో పాల్గొని రతన్ టాటాకు నివాళులర్పించారు. దేశం కోసం, వ్యాపార రంగ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. హబీబ్, ప్రసాద్‌రెడ్డి, సాయిరాం, పవిత్ర, శారద, రవీందర్ పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు

ఉరేసుకొని ఆత్మహత్య

ఇందల్వాయి, న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న భవనంలో మేస్త్రీ దగ్గర పనిచేసేందుకు వచ్చిన కూలీ ఉరేసుకుని మృతిచెందిన ఘటన ఇందల్వాయి మండలం గన్నారంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన షేక్ అబ్దుల్‌జలీల్(34) నెల కిందట గన్నారంలోని ఓ మేస్త్రీ వద్ద పనిలో చేరాడు. మద్యానికి బానిసై పనిచేస్తున్న ఆయన ఇంట్లోనే ఉరేసుకొని మృతిచెందారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రూ.లక్ష నగదు పట్టివేత

బోధన్ (గ్రామీణం, న్యూస్‌టుడే : సాలూరా తనిఖీ కేంద్రం వద్ద శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి వద్ద రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు గ్రామీణ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం అర్ధరాత్రి తర్వాత ద్విచక్రవాహనంపై బోధన్ నుంచి మహారాష్ట్ర వైపుకు ధన్‌రాజ్ వెళ్తున్నారు. తనిఖీ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆతని వద్ద నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇరు రాష్ట్రాల సరిహద్దులో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం.. విద్యార్థులకు గాయాలు

డిచ్‌పల్లి (గ్రామీణం, న్యూస్‌టుడే: ఒకేసారి బస్సులు ఢీకొనడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఆందోళన చెందిన ఘటన ధర్మారం(బీ)లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ధర్మారానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులను తీసుకుని బ్యాంక్ ఎదుట యూటర్న్ తీసుకుంటోంది. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ వాహనాన్ని ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో ఆర్టీసీ బస్సు, బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులో ఉన్న ఇద్దరు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ మమ్మద్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ట్రాక్టర్ డ్రైవర్ తెలిపారు. ధర్మారం తండాకు చెందిన ట్రాక్టర్ యజమాని సునావత్ సంగ్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎమ్మార్వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ ఎంఏ బాసిత్ పరిశీలించి సిబ్బందిని అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మోపాల్, న్యూస్‌టుడే: మోపాల్ సెక్షన్ పరిధిలోని ధర్మారం అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని శుక్రవారం డివిజన్ కార్యాలయానికి తరలించినట్లు బీట్ అధికారిణి పి.సంయుక్త తెలిపారు.

దొంగతనం కేసులో జైలు

వేములవాడ, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ వాసి మైలారం శ్రీనివాస్‌కు చెందిన కరెంట్ మోటార్ వైరును నిజామాబాద్ జిల్లా వీరన్నగుట్ట గ్రామానికి చెందిన గుండారం గంగారాం దొంగిలించాడు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాస్ 17.06.2024న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన వేములవాడ కోర్టు జడ్జి జ్యోతిర్మయి నిందితుడికి నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బోధన్ (గ్రామీణం, న్యూస్‌టుడే : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బోధన్ పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాకాసిపేటకు చెందిన మల్లారం చిన్నసాయిలు కుటుంబంతో కలిసి ఈ నెల 22న వేరే గ్రామానికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దుండగులు తాళం ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చెత్త నిల్వలతో ఇబ్బందులు



ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది సాలూరా నుంచి బోధన్‌కు వెళ్లే రహదారి పక్కన వేస్తున్నారు. దీంతో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. అలాగే చెత్తను కాలుస్తుండటంతో రోడ్డు మీదుగా వెళ్లేవారు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో మధుకర్ వద్ద ప్రస్తావించగా.. డంపింగ్ యార్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, సాలూరా

నరదిష్టి అంటారు.. నిలువునా దోచేస్తారు

• నమ్మించి మోసం చేస్తున్న ఇద్దరు కి'లేడీ'ల అరెస్టు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఇంటింటికీ తిరిగి నరదిష్టి ఉంది.. తొలగిస్తామని.. నమ్మించి ఇంట్లో ఉండే సొమ్ముని, నగదును తెప్పించి మూట కట్టేస్తారు. పూజ చేస్తున్నట్లు నటిస్తూనే మూటలో సొమ్మును దోచేస్తున్న ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ డీఐ ఐపీవీ అప్పలనాయుడు కథనం ప్రకారం.. మాదాపూర్‌లో ప్రైవేట్ ఉద్యోగి నిర్వహిస్తున్న బిట్టేని కరుణ బంజారాహిల్స్ రోడ్ నెం.7లో నివసిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఇద్దరు మహిళలు ఆమె ఇంటికి వచ్చారు. తాము సమీపంలోని గుడిలో పూజలు చేస్తున్నామని, కొంత నగదు సాయం చేయాలని ఆమెను కోరారు. ఆమెను మాటల్లోకి పెట్టి ఇంట్లో నరదిష్టి ఉందని నమ్మించి పూజ చేయాలంటూ ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు తదితర సామగ్రి తీసుకురమ్మన్నారు. దీంతో ఉపాధ్యాయురాలు వారికి రూ.70 వేలు ఇవ్వగా వాటిని సంచిలో మూటగట్టినట్లు ఆమెకు చూపారు. పూజలు చేస్తూ మాయమాటలు చెబుతూ ఆమెను నమ్మించి సంచిలోని రూ.70వేలను కాజేశారు. దూరంగా పంపి అరగంట పాటు పూజ చేసిన అనంతరం తాము వెళ్లిన తర్వాత మాత్రమే సంచిని తెరవాలని చెప్పి వెళ్లిపోయారు. వారు వెళ్లిన కాసేపటి తర్వాత సంచి తీసి చూడగా అందులో డబ్బులు లేవు. దీంతో ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో శ్రీనగర్‌కాలనీలో నివసించే పద్మ కొండల వద్ద రూ.51వేలు, జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో డాక్టర్ ఆర్.ఎన్.సుబ్బారెడ్డి నివాసంలో రూ.లక్ష, సుజిత్ నారాయణ్ ఇంట్లో రూ.లక్ష, పంజాగుట్ట ఠాణా పరిధిలో ఉపాధ్యాయురాలైన రమా గుప్తా నుంచి రూ.లక్ష నమ్మించి కాజేశారు. కాగా ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు సీసీ కెమెరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి నిందితుల జాడ గుర్తించారు. జక్రాన్‌పల్లి ఆటుప్పు గుర్తించి వారిని అరెస్టు చేశారు. తర్వాత విచారించగా జక్రాన్‌పల్లికి చెందిన ఈసీఎంటీ దమ్మాయిగూడలో నివసించే శారదక్క కవిత అలియాస్ రాసూరి కవిత(50), కొడపల్లి మాధవి(40)గా గుర్తించారు. వీరిపై ఇప్పటికే మాదాపూర్‌లో రెండు, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ ఠాణాల్లో ఒక్కో కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు.

ఒకటో ఠాణాలో దాడి కేసు నమోదు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒకటో ఠాణా పరిధిలో ఇద్దరిపై దాడి కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగారంలో నివాసం ఉండే ఆశోక్, సాయిబాబా, పరంజ్యోతుల దుబాయికి పంపిస్తానని చెప్పి వీరి వద్ద రూ.60 వేలు మాలపల్లి చెందిన ముజీర్ హైమద్ తీసుకున్నాడు. డబ్బులు తీసుకుని మూడు నెలలు గడుస్తున్నా వారికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. వివరాలు తెలుసుకుందామని శుక్రవారం ముగ్గురు కలిసి ముజీర్ హైమద్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ముజీర్ ఆక్రోశం పోవడంతో ఆశోక్, కొడుకు ఫజల్ హైమద్ ఇతరులతో కలిసి బాధితులపై దాడి చేశారు. బాధితుల ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

కాంగ్రెస్‌లోకి చేరిక

భీమ్‌గల్ గ్రామీణం: భీమ్‌గల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ప్రేమలత హస్తం గూటికి చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో తన భర్త సురేందర్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండల తాజా మాజీ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ భారాసను వీడి కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు.

ఉషూ క్రీడలో ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం: ఈ నెల 17 నుంచి 24 వరకు జార్జియాలో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్ ఉషూ టోర్నమెంటులో జిల్లా క్రీడాకారులు మల్లారం ఆకాశ్ వెండి, కాంస్య పతకాలు, పరియా ఖానం, సాయి దీక్షిత్ చెరో కాంస్య పతకం సాధించారని తెలంగాణ ఉషూ సంఘం కార్యదర్శి అబ్దుల్ ఉమర్ తెలిపారు. క్రీడాకారులు శుక్రవారం జిల్లాకు చేరుకోగా పలు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ

ఎస్సారెస్పీలోకి 12,754 క్యూసెక్కుల వరద

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 12,754 క్యూసెక్కుల వరద చేరుతోంది. పూర్తి స్థాయిలో 1091 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. 80.501 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదలను 500 క్యూసెక్కులకు తగ్గించి వదులుతున్నారు. కాకతీయ కాల్వ ద్వారా 5800, లక్ష్మి కాల్వ ద్వారా 150, సరస్వతి కాల్వ ద్వారా 500, వరద కాల్వ ద్వారా 5000, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల జరుగుతోంది.

కల్లాల్లో ధాన్యం.. కర్షకుల దైన్యం



ఆర్మూర్ నియోజకవర్గంలో 70,936, బాల్కొండ నియోజకవర్గంలో 75,296 ఎకరాలలో వరి సాగు చేశారు. నందిపేట్, డొంకేశ్వర్, మాక్లూర్, ఆలూర్, భీమ్‌గల్ మండలాల్లో కోతలు మొదలై చాలా రోజులైంది. ఐకేపీ ఆయా సొసైటీల పరిధిలో 20పైగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మద్దతు ధరతో విక్రయించుకోవచ్చని అన్నదాతలు సంతోష పడ్డారు. కాని వారి ఆశలు అడియాసలయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు వేయడం లేదు. మిల్లర్ల విషయంలో ఇంకా నిర్ణయం జరగకపోవటంతో కొనుగోళ్లకు ఆటంకం ఏర్పడుతోంది. కాంటాలు వేస్తే ధాన్యాన్ని ఎక్కడి తరలించాలనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ విషయమై ఉమ్మడి జిల్లా నేతలు ఇటీవల పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిశారు.

☛ కొనుగోలు కేంద్రాల్లో మొదలు కాని కాంటాలు ☛ రంగప్రవేశం చేసిన దళారులు

వరి..రైతుల సిరి.. ఆరుగాలం శ్రమించి పంట పండించారు. చీడపీడలను తరిమి కొట్టారు. ప్రకృతి విపత్తుల నుంచి కాపాడుకున్నారు.. కోతలు మొదలు పెట్టారు.. చివరికి వడ్లు చేతికొచ్చాయి... కొనుగోలు కేంద్రాలకు తరలించారు.. కాంటాలు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కారుమబ్బులతో కలవర పడుతున్నారు.. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడవడంతో ఆరబెడుతున్నారు. వడ్ల కుప్పల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు.

న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం, వేల్పూర్

మండలాల్లో వరి సాగు విస్తీర్ణం (ఎకరాలలో)

మండలం	ఎకరాలు
ఆర్మూర్	12,658
ఆలూర్	12,830
నందిపేట్	18,618
డొంకేశ్వర్	6,988
మాక్లూర్	19,842
బాల్కొండ	4,406
మెండోరా	4,884
ముప్కాల్	4,073
ఏర్గట్ల	4,584
భీమ్‌గల్	25,897
కమ్మర్‌పల్లి	10,931
మోర్తాడ్	8,413
వేల్పూర్	12,108

ప్రైవేటు వ్యాపారులకు విక్రయం..

కోతలు మొదలైనప్పటికీ కొనుగోళ్లు చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలు కలవరపెడుతున్నాయి. కల్లాల్లో వడ్లను కాపాడుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. ఈ తరుణంలో దళారులు రంగప్రవేశం చేశారు. సాగు క్షేత్రాల వద్దే రైతులతో బేరసారాలు మాట్లాడుతున్నారు. తడిస్తే అసలుకే ఎసరు వస్తుందని పలువురు మద్దతు ధర, సన్న రకాలకు బోనస్ దక్కనప్పటికీ ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు.

నష్టపోయారు...



నా పేరు బొంగు రాజేశ్వర్‌గౌడ్. మాది జాగిర్యాల్. కొనుగోలు కేంద్రంలో తూకం ఎప్పుడు వేస్తారో తెలియడం లేదు. వర్షంతో ధాన్యం నష్టపోవడం, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయించా. ప్రభుత్వం చర్యలు తీసుకొని వెంటనే తూకం వేసి ధాన్యం తరలించాలి.



నా పేరు జెల్లాపురం అశోక్‌రెడ్డి. మిర్దాపల్లిలోని ఏడు ఎకరాల్లో సన్న రకం వరి వేయగా.. 232 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రైవేటుగా అమ్ముకోవడం ద్వారా బోనస్ అందక సుమారు రూ. 1.16 లక్షలు నష్టపోయాను.

ఎదురుచూపులు



ఈయన పేరు భోజన్న. నందిపేట్ గ్రామం. సన్నరకం సాగు చేశారు. కోత పూర్తి చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. ఇంకా తూకం వేయడం లేదు. వర్షానికి వడ్లు తడిసిపోకుండా పడిగాపులు పడుతున్నారు.



వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడకు చెందిన నిమ్మల బాలయ్య ఏడు ఎకరాల్లో దొడ్డురకం సాగు చేశారు. 14 ట్రాక్టర్ల ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసింది. సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం సైతం ఏర్పాటు చేశారు. కాని సేకరణ ప్రారంభించ లేదు. ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాలని చూస్తున్నట్లు చెబుతున్నారు.

పంచాయతీ భవనాలు ప్రారంభం



సుదర్శన్ నగర్ తండాలో..

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: భీమ్‌గల్ మండలంలోని సుదర్శన్‌నగర్, సంతోష్‌నగర్ తండాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను శుక్రవారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం భీమ్‌గల్ పట్టణంలో భంజారా భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారాస ప్రభుత్వ హయాంలో తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చామన్నారు.

ఏర్గట్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రూ.15 లక్షలతో నిర్మించిన షాదీఖానా, తాళ్లరాంపూర్, దోంచంద గ్రామాల్లో రూ. 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను శుక్రవారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, భారాస మండలాధ్యక్షుడు పూర్ణానందం, భారాస మైనార్టీ సెల్ అధ్యక్షుడు జైనొద్దీన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మధు, సొసైటీల అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించాలి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పెంచిన వేతనాలు అమలు చేసి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ఆర్మూర్ మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బాబురావు పాల్గొన్నారు..

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిరికొండ మండలానికి చెందిన గర్భిణి మంజుల ప్రాణాపాయ స్థితికి కారణమైన డాక్టర్ గీతపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేసి కోరారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ... ఆసుపత్రిలో చేసిన నిర్లక్ష్యం కారణంగా కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో ఆమె వైద్యం కోసం రూ. 1.70 వేలు ఖర్చు చేశారని అన్నారు. నాయకులు నిఖిల్, మనోజ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్ గ్రామంలోని రాజ్‌నగర్‌లో మురుగు కాలువలు లేవు. ఉన్నచోట సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దోమల బెడద ఎక్కువ అవుతోంది.

-నరేష్, నందిపేట్

సమాధానం: శుభ్రం చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచిస్తా. దోమల నివారణకు మందును పిచికారీ చేయిస్తా.

-లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్

కచ్చ నాలా తీసిన సిబ్బంది






భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: భీమ్‌గల్ మండలం పురాణీపేట్ గ్రామంలో పోచమ్మ గుడి దగ్గర రోడ్డుకి ఒకవైపు నాలా లేక మురుగు రోడ్డుపైకి వస్తుందని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా..' దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వెంటనే కచ్చ నాలా తీయించారు. మురుగు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకున్నారు.

శౌచాలయం.. నిరుపయోగం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ బల్దియా పరిధిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఆర్మూర్ గ్రంథాలయానికి నిత్యం వందల మంది ఉద్యోగార్థులు వస్తుంటారు. గ్రంథాలయంలోనూ నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. గురువారం ఇక్కడకు వచ్చిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ దృష్టికి అభ్యర్థులు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని చెప్పారు. పురుషులు, మహిళలు కలిసి ఒకటే చోట ఉపయోగించుకోవాల్సి వస్తోందని వాపోయారు. పక్కన బల్దియా ఏర్పాటు చేసిన రెండు ప్రజామరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని అందుబాటులోకి తీసుకొస్తే ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు.



పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మంచినీటి కుండీలో ఎడిస్ ఈజిప్ట్ అనే దోమల లార్వా వృద్ధి చెందుతుందని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ సూచించారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. అధికారులు ఇంటింటికీ తిరుగుతూ నీటి నిల్వ చేసిన కుండీలు గుర్తించి తొలగించారు. సీహెచ్‌వో కృష్ణమూర్తి, సబ్ యూనిట్ అధికారి సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, రాజవ్వ, ఆశ కార్యకర్తలు పద్మ, నరేందర్ పాల్గొన్నారు.



కుండీలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, సిబ్బంది

తైక్వాండో పోటీలో కాంస్య పతకం



బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండకు చెందిన రవళిక ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం గెలుచుకుంది. గద్వాలలో ఈనెల 23,24, 25 తేదీల్లో జరిగిన పోటీల్లో అండర్ 17 ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో రవళిక జిల్లా జట్టు తరపున పాల్గొందని మహతి ఆశ్రమం ప్రిన్సిపల్ సుభాషిణి, నరేష్ తెలిపారు. మహతి ఆశ్రమంలో ఉంటూ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం సాధించినందుకు ఆశ్రమం వ్యవస్థాపకులు నిర్మల, తైక్వాండో మాస్టర్ చంద్రబోస్‌లు అభినందించారు. .

గురువులకు ఆత్మీయ సన్మానం

హసాకొత్తూర్(కమ్మర్‌పల్లి),న్యూస్‌టుడే: హసాకొత్తూర్‌లోని మారుతినగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్రీనివాసును కాలనీవాసులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఊరికి దూరంగా ఉండే ఒకే కాలనీ పాఠశాలలో 12 ఏళ్లుగా పని చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో దగ్గరి పరిచయం ఏర్పడింది. వీరంతా పాఠశాలకు తరలి వచ్చి ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంఈవో ఆంధ్రయ్య, వీడీసీ అధ్యక్షులు రజనీకాంత్, మాజీ ఉప సర్పంచి ఏనుగు రాజేశ్వర్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



భోజన ఏజెన్సీ మార్చాలని తీర్మానం

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల బాలికల తల్లిదండ్రులు శుక్రవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను మార్చాలని తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయురాలు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంఈవోలకు వినతిపత్రాలు అందజేశారు. భోజనంలో పురుగులు, వెంట్రుకలు రావడం, మెనూ ప్రకారంగా వంట చేయకపోవడం, నాణ్యమైన కూరలు చేయకపోవడం, దురుసుగా మాట్లాడటం చేస్తున్న భోజన్న ఏజెన్సీని మార్చాలని తల్లిదండ్రులు కోరారు.



ప్రధానోపాధ్యాయురాలికి వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

26, 27 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న వెంకటేష్ తదితరులు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిజామాబాద్‌లో సీపీఎం జిల్లా మహాసభలు ఈ నెల 26, 27 తేదీలలో జరపనున్నట్లు సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో జరగనున్న సభలకు సీపీఎం రాష్ట్ర ప్రతినిధులు వీరయ్య, జ్యోతి, భాస్కర్ తదితరులు హాజరవుతున్నట్లు వివరించారు. భూమన్న, రవి, కుల్దీప్ శర్మ, ఓంకార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

చిట్టాపూర్(బాల్కొండ), న్యూస్‌టుడే: చిట్టాపూర్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీస్ కళాజాత బృందం శుక్రవారం రాత్రి ప్రదర్శన నిర్వహించారు. ఎస్సై నరేష్ శాంతిభద్రతల రక్షణ కోసం పోలీసులు నిర్వహిస్తున్న విధుల గురించి చెప్పారు. కళాజాత బృందం నాటికలు, పాటలతో అవగాహన కల్పించారు. యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు.



మాట్లాడుతున్న ఎస్సై నరేష్

రక్తదాన శిబిరం



ఆర్మూర్ గ్రామీణం: పట్టణంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఎం.ఆర్.గార్డెన్స్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై రక్తదానం చేసిన యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్‌మున్నా, ఎస్‌హెచ్‌వో రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు

బాల్కొండ: బాల్కొండలో ఉపాధి హామీ కింద 2025-26 సంవత్సరానికి చేయాల్సిన పనుల గుర్తింపు కోసం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు కందారపు రమేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్యం

బాల్కొండ: జిల్లాలో సంచార పశువైద్య శాల ద్వారా పశువులకు వైద్యం అందుతుందని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గాదం మధుకుమార్ తెలిపారు. బాల్కొండ, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ నియోజక వర్గాల్లో 1962 సంచార పశు వైద్య శాల వ్యాన్లు తిరుగుతున్నాయని చెప్పారు.

లింబాద్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

వేల్పూర్: భీమ్‌గల్‌లోని శ్రీ లింబాద్రి లక్ష్మీ నర్సింహ స్వామి కల్యాణోత్సవం, జాతర వేడుకలు జరగనున్నాయి. వీటికి రావాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి శుక్రవారం ఆహ్వాన పత్రికను పురోహితుడు పార్థసారథి అందజేశారు.

అవీ...ఇవీ.. అన్నీ

ఉపాధ్యాయులకు వీడ్కోలు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వడ్డెర కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల వరకు ఉపాధ్యాయులుగా పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ ఖాందేష్ సంగీత ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సంధ్య, రాణి, భాగ్యలక్ష్మిలను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు తుమ్మల లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకుడు సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

బాల్కొండ: మెండోరా మండలంలో బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి ఆర్థిక సాయం చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం అందజేశారు. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులను అందజేశారు. వెల్గటూర్‌లో సాయారెడ్డికి సాయం మంజూరు కాగా చెక్కును పార్టీ సోము రాజేందర్, గ్రామ అధ్యక్షుడు సోమ్ రవి, ముస్కు మహిపాల్, రెంజర్ల సొసైటీ మాజీ ఛైర్మన్ గంగారెడ్డి, ప్రసాద్, సుమన్, సత్యాగౌడ్‌లు పాల్గొని అందజేశారు.

ఏకరూప దుస్తుల వితరణ

బాల్కొండ, న్యూస్‌టుడే: మెండోరా మండలం వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతలు ఏకరూప దుస్తులు వితరణగా శుక్రవారం అందజేశారు. దాతలు సోమ రవి, ముస్కు మహిపాల్, గోనె కన్నయ్య, వ్యాపారి సాదక్ ఫర్టిలైజర్ యజమాని టి. భూమన్న, సాగర్, చింతల గంగాధర్, ప్రధానోపాధ్యాయులు కాసం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం అందజేత

ముప్కాల్(బాల్కొండ): ముప్కాల్ పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటాన్ని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు సంజీవ్ థామస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌యాదవ్‌కు శుక్రవారం అందజేశారు. గంగారాం, నర్సయ్య, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

బాల్కొండ: ముప్కాల్‌లోని ఇందిరమ్మ కాలనీలో మంచి నీటి సమస్య ఎదురవుతుందని పరిష్కరించాలని కోరుతూ కాలనీ మహిళలు పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌యాదవ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్యదర్శి శుక్రవారం సిబ్బందితో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు.



గోదావరిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: అలూర్ మండలకేంద్రానికి చెందిన కండెల గడ్డం నర్సయ్య (78) ఆత్మహత్యకు పాల్పడినట్లు నందిపేట్ ఎస్సై హరిబాబు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్న ఈయన గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి.. ఉమ్మెడ శివారులోని గోదావరి నది వైపు వచ్చి వంతెనపై నుంచి దూకినట్లు పేర్కొన్నారు. శుక్రవారం సమీపంలోని పంచముఖి హనుమాన్ మందిరం సమీపంలోని నీటిలో శవం లభ్యమైనట్లు వెల్లడించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరి అరెస్టు

పోచంపాడ్(బాల్కొండ), న్యూస్‌టుడే: మెండోరా మండలం పోచంపాడ్‌లో పుష్కర ఘాట్ల సమీపంలో లక్కీగేమ్ పేరుతో జూదం నిర్వహిస్తున్న ఇద్దరిని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు. సుంకరి వెంకన్న(పెర్కిట్), చావూస్(ఆర్మూర్)లకు చెందిన ఇద్దరు జూదం నిర్వహిస్తున్నారని సమాచారంతో దాడి చేసి ఇద్దరిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రూ.వేయి నగదు, రెండు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చౌట్‌పల్లి(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: చౌట్‌పల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్ కుంట ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఏ గ్రేడు ధాన్యానికి రూ. 2320, బీ గ్రేడు ధాన్యానికి రూ 2300 మద్దతు ధరగా నిర్ణయించినట్లు కార్యదర్శి శంకర్ తెలిపారు.



చౌట్‌పల్లిలో

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకొని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండలం పిప్రి సొసైటీ ఛైర్మన్ సోమ హేమంత్‌రెడ్డి రైతులకు సూచించారు. పిప్రి సొసైటీ పరిధిలోని పిప్రి, అమ్దాపూర్, మగ్గిడి గ్రామాలలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. సొసైటీ వైస్ ఛైర్మన్ గుండా లింగన్న, ఏఈవో నిషికాంత్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సురేష్, డైరెక్టర్లు ఇజాఫ్, మహేష్, సంతోష్, గంగాధర్, దేవారెడ్డి, రాజు, సీఈవో హన్మాండ్లు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి భూమి పూజ



నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్మల్ గ్రామంలో శుక్రవారం ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 20 లక్షలు వెచ్చిస్తున్నారు. ఈ నిధులను మంజూరు చేసిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాజపా నాయకులు ఉద్గిరి రవి, గంగాధర్‌మల్లేశ్, రాందాస్, గాదరి పవన్, అల్లెం భూమేశ్ పాల్గొన్నారు.